


# మనుషుల్లో దేవుడు

సిరియస్ రాజు

చల్లగా వీస్తూన్న ఎదురుగాలిని మెత్తగా కోసుకుంటూ ముందుకు దూసుకు పోతోంది బస్సు. హుబ్లీనుంచి థార్ వార్ కి పోతూన్న బస్సది. నేను విండో పక్కనే కూర్చున్నాను. బయటికి తొంగిచూస్తే నల్లని తార్రోడ్డు కొండల్ని చుట్టుకొని పైకెగబాకుతోన్న నల్ల తాచులా వుంది. రోడ్డుకి ఎడంచేతిపక్క కొండవాలుల్లో, గుబురుగా పెరిగిన కాఫీతోటలు, యాలకులతోటలు. కుడి చేతిపక్క అగాధాలఅట్టడుగుతాకుతున్న లోయలు. రాత్రంతా లోకాన్ని ఏలిన చీకటి అలసిపోయి పగటిపూట ఆ లోయల్లో విశ్రాంతి తీసుకుంటోందా అనిపించింది నాకు. మరీ అదే పనిగా ఆ లోయల్లోకిచూస్తే కళ్ళు తిరుగుతున్నాయి. కాఫీతోటల్లోను, యాలకుల తోటల్లోను రంగురంగుల చీరలు కదులుతున్నాయి. ఆ చీరల కదిలికకు గుబురుగా పెరిగిన కాఫీమొక్కలకు వేలాడుతోన్న కాఫీగింజల గుత్తులు పరుగెత్తే కన్నెపిల్ల చెవిని వేలాడుతోన్న బుట్ట లోలకుల్లా కదుల్తున్నాయి.

ఒక మళుపులో మా బస్సు ఆగింది. ఎడంచేతిపక్క పెద్దమర్రిచెట్టు. డ్రైవరు కండక్టరు కిందికి దిగారు. అక్కడి ప్రకృతిశోభను చూడాలన్న ఉబలాట మున్న ప్రయాణీకులూ దిగారు. అందరితోబాటు నేనూ దిగాను. మేమంతా ఆకాశంలా నలుమూలలకి విస్తరించిన ఆ మర్రిచెట్టునీడలోకి నడిచాం. ఎంత చూసినా తనవి తీరక అదే పనిగా అక్కడి ప్రకృతి అందాన్ని తరచి తరచి చూస్తున్నారు అక్కడ దిగిన ప్రయాణీకులు.

నన్ను మాత్రం ఆ చెట్టునీడనవున్న విగ్రహం ఆకర్షించింది. రంగుమాసి నిరుపేదలా వుంది. అక్కడక్కడ పక్షుల రెట్టలూ, చుట్టూరాలిన ఎండు టాకులు, దట్టంగాపట్టిన రోడ్డుదుమ్ముతో అనాథలా నిలబడిందా విగ్రహం. ఊరు

పల్లెకానివోటవున్న ఆ విగ్రహాన్ని తదేకంగాచూస్తూ నిలబడ్డాను నేను.

ఇంతలో డ్రైవరూ కండక్టరూ తాటి గులకల్లోంచి పారుతోన్న ముత్యాల్లాంటి నీళ్ళలో కాళ్ళుకడుక్కొని ఆ విగ్రహం దగ్గరకొచ్చారు. చేతిలోని పూలపొట్లం విప్పి, విగ్రహం పాదాల దగ్గర ఆ పూలను వుంచి ఎంతో నమ్రతగా నమస్కరించారు వాళ్ళిద్దరూ. కొబ్బరికాయ కొట్టి చెక్కల్ని విగ్రహంముందుంచారు. తోటల్లో పనిచేస్తోన్న జనం మా అలికిడికి పరుగెత్తుకొచ్చి కలియబడి ఆ చెక్కల్ని అందుకున్నారు.

ఆ హడావిడితో నాలో కుతూహలం మరీ ఎక్కువై ఆ అనామక విగ్రహాన్ని రెప్పార్పకుండా చూస్తూ వుండి పోయాను.

ఆ విగ్రహం దేశనాయకుడుది కాదు.

శాస్త్రవేత్తది కాదు.

మత ప్రవక్తది కాదు.

దెయ్యానిదీ దేవరదీ కాదు.

మామూలు మనిషిది.

నిక్కరు, పొట్టిచేతుల చొక్కాతో వున్న ఒక మామూలు మనిషి మామూలు విగ్రహం అది.

ఆ విగ్రహం పాదాలకింద ఆ వ్యక్తి పేరు లేదు.

శంకుస్థాపన చేసిన మంత్రి పేరు లేదు.

ఆవిష్కరించిన అధినేత పేరుతో పాలరాతి ఫలకం లేదు.

జనం సర్దుకుంటున్నారు. పనివాళ్ళు తోటల్లోకి వెళ్ళిపోయారు. కొందరు ప్రయాణీకులు బస్సులోకి చేరిపోయారు. నేనూ బస్సువైపు కదలబోయాను. ఇంతలో ఒక ముసలతను ఆ విగ్రహాన్ని సమీపించాడు. ఆయన ఫుల్ సూట్‌లో వున్నాడు. చేతిలోవున్న కర్ర పక్కనపెట్టి, చేతులు జోడించి ఆ విగ్రహానికి నమస్కరించాడు. అర్థ నిమీలితనేత్రాలతో విగ్రహాన్ని పైనుంచి కిందిదాకా పరికించాడు. తనివితీరక విగ్రహానికి మరీ చేరువై తన రెండు చేతులతో చేతికందినంతవరకూ ప్రతి అణువునూ ఆప్యాయంగా తడుముతూ, వణుకుతున్న చేతుల్ని విగ్రహంపాదాల మీదికి జార్చాడు. అప్పటికే అతని కళ్లు చెమ్మగిల్లాయి.

ఎందుకో యింకా అతనికి తృప్తిలేదు.

ముడుతలుదేరిన అతని చెక్కిళ్ళను ఆ పాదాలమీద ఆన్చి, ఆ విగ్రహం కాళ్ళను కరిగిపోయేటంత యిదిగా కౌగిట చేర్చుకొన్నాడు. చివరికి వదల లేక వదలలేక తడబడే అడుగులతో, తెగని చూపులతో విగ్రహం దగ్గరనుంచి శరీరాన్ని బస్సుదగ్గరకు చేర్చాడు.

ఆ దృశ్యం నన్ను కదిలించింది. ఇంతలో డ్రైవర్ హారన్ మోగించాడు. నేనూ అతని వెనకే వచ్చేసి బస్సు ఎక్కేసాను. అతన్ని అడిగి ఆ విగ్రహం గురించి, ఆ విగ్రహంతో అతనికి వున్న సంబంధం గురించి తెలుసుకోవాలనిపించింది నాకు. నెమ్మదిగా అతని పక్క సీటులోకి చేరాను.

కోటుజేబులోంచి రుమాలుతీసి కళ్ళు వత్తుకుంటున్న అతన్ని 'ఎంతవరకు వెడుతున్నారు?' అనడిగాను.

"ధార్‌వార్ వరకు"

"మీరు ధార్‌వార్‌లోనే వుంటున్నారా?"

"లేదు. అసలు మాదీప్రాంతం కాదు." ముక్తసరిగా అన్నాడతను.

"అయితే ఏదో పనిమీద వెడుతున్నట్టున్నారు" అన్నాను.

"కాదండి. ప్రతి సంవత్సరం ఈ రోజున హుబ్లీ టు ధార్‌వార్ బస్సుల్లో ప్రయాణం చేయడం గత యిరవై మూడేళ్ళుగా అలవాటైపోయింది. అలవాటనడంకంటే అది నా ధర్మం అనుకుంటాను." ఎంతో ఆవేశంతో అన్నాడతను.

ఆ తర్వాత యింకెలా మాట్లాడాలో నాకు తెలియలేదు. కాని ఆ విగ్రహం గురించి తెలుసుకోవాలన్న కుతూహలం చావలేదు. చివరికి ధైర్యంచేసి, 'ఆ విగ్రహంచూసిమీరంతగాకదిలిపోయారు. నేను మిమ్మల్ని చూస్తూనే వున్నాను. ఎవరికిలేని అనుబంధం మీకూ ఆ విగ్రహానికీ ఏమిటో తెలుసుకోవచ్చా?' అనడిగాను.

ఆయన నవ్వారు. ఆ నవ్వులో తాత్విక ధోరణి అగుపించింది నాకు. 'నిండైన మానవతగల మనుషుల మధ్య వుండే అనుబంధమే మా యిద్దరిమధ్య అనుబంధం. అనుబంధం అనడంకంటే ఆ మానవతామూర్తిమీద నాకున్న భక్తి కృతజ్ఞత లనడం సబవనుకుంటాను' అన్నారాయన.

"ఎవతరను?"

"డ్రైవరు."

"ఈ కొండల్లో అతని విగ్రహం ఎందుకు ప్రతిష్ఠించారు?"

ఆయన సమాధానం చెప్పకుండా "నీకు తెలుసుకోవాలనివుందా?" అన్నట్టు నా కళ్ళలోకి చూసారు.

"ప్లీజ్ చెప్పండి'' అన్నాను బతిమాలుతోన్న ధోరణిలో.

"ఇది యిరవైమూడేళ్ళ క్రితం నాటి పాతకథ బాబు. చాలా పెద్దకథకూడ."

"అయినా ఫరవాలేదు. చెప్పండి''

"సరే: నువ్వంత ఆసక్తిగా అడుగుతూన్నప్పుడు తప్పకుండా చెప్పాలి." అని ఆయన ప్రారంభించారు.

'ఎవరు గుర్తించినా గుర్తించక పోయినా, ఎవరు ప్రచారంచేసినా చేయక పోయినా, యిది ఒక జరిగిన కథ. కొన్ని గుండెల్లో ఎన్నటికీ చెరిగి పోకుండా నిలచిపోయే సంఘటన. సరిగ్గా యిరవైయేళ్ళక్రితం ధార్‌వార్

నుంచి హుబ్లీకిపోయే బస్సులో నేనూ మా ఆవిడా ప్రయాణం చేస్తున్నాం. యిటునుంచి వెడుతోంటే అంతా మెరక అటునుంచి అంటే ధార్‌వార్ నుంచి హుబ్లీకిపోతోంటే అంతా డౌన్. అన్నట్టు నా భార్య అంటే యిప్పటి నా ఆకారాన్ని చూసి అవ్వనుకొనేవ్. నే చెప్పేది యిరవైయేళ్ళ క్రితంనాటిమాట. ఆనాటికి మేమిద్దరం కొత్తమాయని దంపతులం. చూపులకు స్పర్శకే కదలిపోయే మన సులు మావపుడు. ఈ ప్రాంతం ప్రకృతి శోభను చూడాలని బయలుదేరాం మే మిద్దరం. నాభార్య మహితవిండోపక్కనే కూర్చుంది. ఆమె పక్కనే నేను. బస్సు ధార్‌వార్ నుంచి హుబ్లీవైపుపోతోంది. అంతా వాలేమో, గాలిలా గాలిలో తేలి పోతోంది. కాని డ్రైవరు గుక్కతిప్పు కోడానికి వీలులేనన్ని మళుపులు.కన్నెత్తి పరకాయిస్తే కొండలు కనబడతాయేగాని రోడ్డు కనబడదు. ఎంతో నేర్పుగా డ్రైవరు బస్సును పామునడకల్తో మెలి కలు మెళకువగా తిప్పుతున్నాడు. బస్సు మెలికలు తిరిగినప్పుడు నేను మహిత మీదో, మహిత నామీదో పడుతోన్నాం. ఆ చల్లని గాలికి, నా మహిత నేచాచిన జబ్బమీద తల ఆన్చి హాయిగా నిద్ర పోతోంది. ఆమె పెదవులమీది చిరునవ్వు వీస్తున్న చిరుగాలితో ముచ్చట్లాడు తోంది. ఆమె అందాన్ని తనివితీరా తడివి అనుభవించాలన్న కోర్కెతో చల్లని ఆ గాలి బస్సులోని ప్రయాణీ కుల నందర్నీ వదిలేసి ఆమెకే తాకు తోందా అనిపించింది నాకు. ఆమెముఖం మీది ముంగురులు రెపరెపలాడడం చూస్తే వెన్నెలను రంగస్థలంగా పరచి నల్లని మేఘాలు నర్తకి బృందంగావచ్చి నృత్యాలు చేస్తూన్నాయా అనిపించింది నాకు.' అంటూ ఒక సిగార్ తీసి ముట్టించి గుప్పున పొగవదలి ఆపొగలో గతించిన ఆ దృశ్యాన్ని చూస్తూన్నట్టు వుండిపోయారాయన.

ఆ వయసులోవున్న ఆ వ్యక్తి నోటి నుంచి ఆ మాటని వింటూన్నపుడు వయసు మనిషికేగాని మనసుకి కాదని పించింది నాకు. సెలయేరులా పరుగెడు తోన్న ఆయని తియ్యని గతానుభవాలకు అడ్డుతగలడం యిష్టంలేక కలిసి ముందుకు సాగుపోతున్నాను. అందుకే విగ్రహం గురించి ఆయనేమీ మొదలు పెట్టలేకపోయినా నేనలా వింటూ వుండి పోయాను.

తిరిగి ఆయన ప్రారంభించారు.

"నా మహితను ఒక్కసారి దగ్గరకు తీసుకున్నాను. ఆమెకళ్లతెరిచింది. కళ్ళ లోని సిగ్గుదొంతరులు నన్ను వారిం చాయి. నాకు వివాహం జరగడమే ఆలశ్యంగా జరిగింది. మహిత నాకంటే బాగా చిన్నదనిపించేది నాకు. అందుకే ఆమెను లాలించడమన్నా, బుజ్జగించడ మన్నా సరదా నాకు.

ఆమె ముంగురులను సరిచేస్తూ 'గాలి యిబ్బందిగా వుందా?' అనడిగాను.

'లేదు బాగుంది.' అందామె.

ఎందుకో ఒక్కసారి నా చూపులు ఆమె ముఖంమీదినుంచి తప్పుకొని బయటికి తొంగిచూసాయి. ఎడంచేతి పక్క భయంకరమైన కొండలోయలు. ఈ బస్సు అందులోకి పడిపోతే అన్న వూహవచ్చింది నాకు. పడిపోతున్నపుడు ఎలా వుంటుందో వూహిస్తే అందమైన రంగులపక్షి ఆకాశాని కెగరలేక పాతా ళానికి రాలిపోతున్నట్లనిపించింది నాకు. నేనే స్వయంగా ఆ లోయలోకి పడిపో తూన్నట్లనిపించింది. గుండె ఝల్లుమంది. రక్తంనీరై పోయింది. స్వర్గంలోవున్న నన్ను ఎవరో మెడబట్టి నరకానికి గెంటి నట్లనిపించింది.

అంతలో...

'ఎవరి సీట్లలో వాళ్లు కదలకుండా కూర్చోండి. కంగారుపడకండి.జాగ్రత్త! బస్సు బ్రేకులు పనిచేయడం లేదు.' అని అరచాడు డ్రైవరు.

బస్సు దేనికైనా గుద్దితే చనిపోతా మన్న భయంతో ఎదుటి సీట్లలోవున్న జనమంతా వెనకసీట్లవైపు పరుగెత్తారు. వెర్రి అరుపులు. కేకలు. ఏడుపులు. తల్లులు పసిపాపల్ని గుండెలకు హత్తు కున్నారు. ఎవరి ఆత్మీయుల్ని వారు అక్కున చేర్చుకున్నారు. జనం గజగజ వణికిపోతున్నారు. నా మహిత సందిట్లో నేను – నా సందిట్లో మహితా ముడి వేసుకుపోయాం. ఆ స్పర్శలో యిది వరకటి సుఖం లేదు. ఆమె చూపుల్లో యిదివరకటి సిగ్గులేదు.

భయం...భయం...భయం.అందరి కళ్ళల్లోనూ భయం. బతకాలన్న కోరిక! అందరూ పోయినా కనీసం తనయినా బతకాలన్న కోరిక!

బస్సులో మృత్యువు విలయతాండవం చేస్తోంది. భయంకరహస్తాన్ని చాచి దొరికిన ప్రతి ప్రాణినీ అందుకోడానికి ప్రయత్నిస్తోంది. కొందరు ఆ భయం లోంచి తేరుకున్నారు. 'అంత కళ్ళుమూసు కుని ఎలా తీసావ్ బస్సుని బయటకి. బ్రేకులు సరిగ్గా వున్నాయో లేదో ముందుగా చూసుకో నక్కర్లేదూ?' అని డ్రైవర్ని గదమాయించారు.

'ఏక్సిడెంట్సు చెప్పిరావు సార్! ప్రాణమంటె మీ కెంతతీపో నాకూ అంతే తీపి. దయచేసి మీమీ సీట్లలో మీరు కదల కుండా కూర్చోండి. నా ఒక్కడిప్రాణం పోయినా మీ అందరి ప్రాణాలు కాపాడ్డా నికే ప్రయత్నంచేస్తున్నాను.' అంటూ వెనక్కి తిరక్కుండానే బస్సుని క్షణం క్షణం గండంనుంచి నేర్పుగా తప్పిస్తూ మెలికలు తిప్పుతున్నాడు.

ఇంకా పదిమైళ్ల ప్రయాణం చేస్తేనే గాని, ఆ మెలికల డౌన్‌రోడ్డుపోయి, చదునైన రోడ్డు రాదు. అందరిప్రాణాలు అరచేతిల్లో పెట్టుకుని క్షణం ఒక యుగంగా గడుపుతున్నారు. మహిత నన్నింకా అంటిపెట్టుకునే వుంది. గజ

గజవణకిపోతోంది. ఆపట్టుచూస్తే యిద్దరము కలిసే చావాలన్నట్టు వుంది. తన్ను వదిలేసి నే నొక్కడినీ ఎక్కడ తప్పించుకొని బతికిపోతానో అన్నట్టు ఈర్ష్య ఆమె పట్టులో ఫీలయ్యాను నేను. ఆ క్షణంలో అంతగా నే ప్రేమించిన నా మహితపోయినా కనీసం నేనైనా బతికితే బాగుండు ననిపించింది నాకు.

నా స్వార్థం నాకే అసహ్యమనిపించింది.

భయం, ప్రాణంమీది తీపి మనిషిని ఎంత నీచానికి దిగజారుస్తాయో మొట్టమొదటిసారిగా ఇవేళే తెలుసుకున్నాను నేను.

మళ్ళీ డ్రైవరు వార్నింగ్!

'ఒక్క నిమిషం నే చెప్పినట్టువినండి సార్! నేను మామూలు డ్రైవర్నే! మీ అందరి దృష్టిలో నేను చాలా చిన్న వుద్యోగిని. కాని మీలాంటి పెద్దలప్రాణాలన్నీ నా చేతుల్లో వున్నాయిప్పుడు. నా ప్రాణంపోయినా మీ అందరి ప్రాణాలూ కాపాడ్డం నా ఉద్యోగ ధర్మం. మీకెవరికైనా తగిల్తే చిన్నదెబ్బలు తగలవచ్చేమోగాని మీ ప్రాణాలకేమీ ప్రమాదం లేదు. మీ సీట్లలో మీరు కదలకుండా కూర్చోండి. దొరికిన అసరాని బిగ్గాపట్టుకోండి. కదలకండి.' అంటూనే బస్సుని తీసుకెళ్ళి, యింక చేయగలిగిందిలేక, బస్సు అగాథంలో పడిపోకుండా కాపాడ్డంకోసం మనం యిందాకా చూసిన మర్రిచెట్టుకి గుద్దించాడు. బస్సులో వున్న జనం ఒక్కసారి వెనక్కిముందుకు వూగారు. కొందరు కెవ్వుమని వెర్రిగా అరచారు. కొందరు చావుకేక పెట్టారు. కొందరు మతిపోయినవాళ్ళలా అరచారు.

కొందరు స్థంభించిపోయి అలా వుండిపోయారు. బస్సు ఆగిపోయింది.

ఒక్క క్షణం జనమంతా స్థాణువుల్లా వుండిపోయారు. మరుక్షణంలో కొందరు కోలుకున్నారు.

కండక్టరూ అతని వెనక మే మందరం కిందికి దిగాం. డ్రైవరు దగ్గరకు వరుగెత్తాం. విరిగిపోయిన స్టీరింగ్‌మీద తల వాల్చి పడుకున్నాడతను.

రక్తం ప్రవహిస్తోంది.

అతని ముఖంనిండా గాజు పెంకులు గుచ్చుకున్నాయి.

అతనిముఖం చెడిపోయిన పాత ఆయిల్ పెయింట్‌లావుంది. స్టీరింగ్ రాడ్ అతని హృదయాన్ని చవిచూసింది. అతను చనిపోయాడు—' ఆయన ఆగారు.

నా గుండె గతుక్కుమంది.

ఆయన జేబులోంచి రుమాలుతీసి కళ్ళు వత్తుకున్నారు.

"అతనికీ భార్యాబిడ్డ లున్నారట! ప్రాణంమీద తీపి వుంది. బతుకులో కోర్కెలున్నాయి. భవిష్యత్తుమీద ఆశ వుంది. జీవితంలో మమతలూ మమకారాలు,బరువులూబాధ్యతలూవున్నాయి. అతను కావాలనుకుంటె, బ్రేకులు పడటంలేదని తెలియగానే డోర్ తెరుచుకుని కుడిచేతి పక్కకి దూకేస్తే ఏ కాలో చెయ్యో విరిగినా బతికే అవకాశంవుంది. అయినా అతనలా చెయ్యలేదు. తన ధర్మాన్ని నిర్వర్తించడంలో తెలిసితెలిసీ తనప్రాణాల్ని గడ్డిపరకలా ఒడ్డాడు.

మా అందరి ప్రాణాల్ని కాపాడ్డంకోసం తన ప్రాణాన్ని ఫణంగా ఒడ్డాడు. ఓడిపోయాడు పాపం! కాని మాకు భవిష్యత్తును అందించాడు.

ఆ క్షణంలో మా అందది మనసులూ కృతజ్ఞతో నిండిపోయాయి. నివరికి తోచిన సహాయం వారు అందజేశారు. అతని కుటుంబానికి ఆ మొత్తాన్ని అందించాలని నిర్ణయించాం. చేసింది చాలదనిపించింది నాకు.

మేము పొందిన దానితో మేమందించింది సరిపోలిస్తే చాలా అల్పమనిపించింది. అందుకే అతను పోయినా అతని రూపాన్ని నేనే స్వయంగా ఆక్కడప్రతిష్ఠించాను.

అతను పేరున్న నాయకుడు కాదు.

గొప్ప శాస్త్రవేత్త కాదు.

కావాలని తన డబ్బుతో తన విగ్రహాన్ని నిలబెట్టించుకొన్న కీర్తికండూతిపరుడుకాడు.

గారడీలు తెలిసిన బాబాకాదు.

తోటిమనుషుల ప్రాణాల్ని నిలబెట్టడానికి తన ప్రాణాలిచ్చిన మానవతామూర్తి.

అతని పేరుగాని, త్యాగంగాని పత్రికల్లో పతాకశీర్షికగా రాలేదు.

అతని ఫొటో పత్రికల మొదటి పేజీల్లో అగుపించలేదు.

పార్లమెంటులోనూ, శాసనసభల్లోనూ అతని ఆత్మశాంతికి తీర్మానాలు ప్రవేశపెట్టబడలేదు.

"బస్సు ఏక్సిడెంట్‌లో డ్రైవరు మృతి. ప్రయాణీకులందరూ క్షేమం. అన్నవార్త పత్రికల్లో మారుమూల ఎవరి కంటాపడకుండా వుండేటట్లు ప్రచురించబడింది.

కాని ఆ నాడు బస్సులో ప్రయాణం చేసిన ప్రయాణీకుల గుండెల్లో అతని రూపం చెరగనిముద్రగా నిలిచిపోయింది. అతడు చరిత్రలో స్థానంలేని చరిత్రహీనుడు. అయినా మా అందరి బతుకుల చరిత్రా అతని చరిత్రే. అతను మనుష్ఘల్లో మంచిమనిషి." అని ఒక్కక్షణం ఎవరినో ధ్యానిస్తోన్నట్లు ఆయన కళ్ళు మూసుకున్నారు.

నాకు ఎందుకనో తిరుగు ప్రయాణంలో అక్కడ మళ్ళీ దిగి ఆ మంచి మనిషిని మరోసారి చూడాలనిపించింది.

*